## వీధి కుక్కలపై చర్యలు తీసుకోలేరా?

-కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి

**గజ్వేల్, నవంబరు 1, ప్రభాతవార్త:** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఏవీధిలో చూసినా వీధి కుక్కలు స్వైరవిహారంచేస్తున్నాయి. విద్యార్థులు, వృద్ధులు రోడ్డుపైతిరగాలంటే కుక్కలభయంతో బిక్కుబిక్కుమంటున్నారు. మున్సిపల్‌పరిధిలోని 20వార్డులలో ఎంతోమంది కుక్కలదాడిలో గాయపడి ఆసుపత్రిపాలైన సంఘటనలు ఉన్నాయి. శుక్రవారంరాత్రి ప్రజ్ఞాపూర్‌కు చెందిన మలమైన సత్తయ్యకు సంబంధించిన మేకలదొడ్డిలోని గొర్రెపిల్లలపై వీధికుక్కలు సమూహంగా దాడిచేసి సుమారు 6గొర్రె పిల్లలను కరిచిచంపాయి. దీంతో సత్తయ్య తీవ్ర మనస్తాపానికిగురై మున్సిపల్ అధికారులపై మండి పడ్డారు. మున్సిపల్‌పరిధిలో కుక్కలు, కోతులు అధికంగా స్వైరవిహారం చేస్తుంటే మున్సిపల్ సిబ్బంది ఏమిచేస్తున్నారని, గొర్రెపిల్లలు చనిపోయినందుకు నష్టపరిహారం ఎవరు ఇస్తారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు వీధికుక్కలను నియంత్రించాలని పేర్కొన్నారు. చనిపోయిన గొర్రెపిల్లల విలువ సుమారు లక్షవరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
# వార్త

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

**ములుగు, నవంబరు 1, ప్రభాతవార్త:** అప్పులబాధతో గతనెల 14వ తేదీన గడ్డిమందు తాగిన వ్యక్తి చికిత్సపొందుతూ మృతిచెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ములుగు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాలప్రకారం ములుగుగ్రామానికి చెందిన ప్రశాంత్‌కుమార్(23) అనేయువకుడు డ్రైవింగ్‌పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతనితండ్రి సాయికుమార్‌కు ఐదు సంవత్సరాల క్రితం ఆక్సిడెంట్‌కాగా, పెద్దమొత్తంలో అప్పులు అయ్యాయి. అవితీర్చడానికి వారికి ఉన్న ట్రాక్టర్‌ను అమ్మినా అప్పులుతీరలేదు. దీంతో అప్పులబాధతో ప్రశాంత్‌కుమార్ గతనెల14న వారి వ్యవసాయబావి వద్దకువెళ్ళి గడ్డిమందు తాగాడు. ఇదిగమనించి కుటుంబసభ్యులు ప్రశాంత్‌కుమార్‌ను గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. మృతునికి రెండుసంవత్సరాల క్రితం వివాహం కాగా, భార్య, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

## వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది

-మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

వరద బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎవరూ అధైర్యపడాల్సిన అవసరంలేదని రాష్ట్ర రవాణాశాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 29న గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లాలో కురిసిన భారీవర్షానికి నష్ట పోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రధానంగా హుస్నాబాద్ నియోజకవర్గంలో మొంథా తుపాన్ కారణంతో అతిభారీనష్టం జరిగిందన్నారు. అలాగే ప్రాణనష్టం సైతం జరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. పంటపొలాల వద్ద ఆరబెట్టిన హుస్నాబాద్ మార్కెట్ యార్డుకు తెచ్చిన 90మెట్రిక్‌టన్నుల ధాన్యం పూర్తిగా కొట్టుకుపోవడం జరిగిందన్నారు. మొంథా తుపాన్ కారణంగా వేలాది మెట్రిక్‌టన్నుల వరి తడిసి రైతులకు అపారనష్టాన్ని మిగిల్చిందన్నారు. అపారనష్టంపై తనతోపాటు జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి నష్టపోయిన పంటలతోపాటు హుస్నాబాద్ మార్కెట్ యార్డులో కొట్టుకుపోయిన ధాన్యాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందన్నారు. వెంటనే నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. అక్కన్నపేట మండలం మోత్కులపల్లివద్ద వరదలో గల్లంతై మరణించిన బాధిత కుటుంబాలను, అధికవర్షాలతో మృత్యువాతపడ్డ 8మంది పశువుల యజమానులను ప్రభుత్వం తరపున ఆదుకుంటామన్నారు. ఈనెల 31న సిఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఏరియల్ సర్వేద్వారా హుస్నాబాద్ నియోజకవర్గంలో నష్టపోయిన పంటలు, దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులను పరిశీలించి హనుమకొండ కలెక్టరేట్‌లో అధికారులతో వరదనష్టంపై సమీక్షాసమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. హుస్నాబాద్ పట్టణంలో వరదనీటితో ప్రజలు పడ్డ ఇబ్బందులు భవిష్యత్‌లో రాకుండా మురుగునీరు, వరదనీరు డ్రైనేజీవ్యవస్థ, రోడ్లనిర్మాణానికి రూ.80కోట్లతో డిపిఆర్‌ను రూపొందించడం జరిగిందన్నారు. జిల్లావ్యాప్తంగా మొంథా తుపాన్‌తో 3491మంది రైతులకు సంబంధించిన 4844 ఎకరాల్లో వరి, 393మంది రైతులకు చెందిన 588 ఎకరాల్లో పత్తి, 32రైతులకు చెందిన 51 ఎకరాల్లో మొక్కజొన్నపంటకు నష్టం జరిగిందన్నారు. కాగా హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల్లో 2565మంది రైతులకు సంబంధించిన 3454 ఎకరాలలో వరి, 24మంది రైతులకుచెందిన 37ఎకరాల మొక్కజొన్న, 290మంది రైతులకు చెందిన 454ఎకరాల పత్తిపంటకు నష్టంజరిగినట్లు ప్రాథమిక అంచనావేసినట్లు తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగా ఎకరాకు రూ.10వేల చొప్పున చెల్లించడం జరుగుతుందన్నారు. హుస్నాబాద్ మార్కెట్‌యార్డులో తడిసిన, 100మంది రైతుల 230మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని మద్దతుధరతో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.

## రివిజన్ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలి

-రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య, తదితరులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబరు 1, ప్రభాతవార్త:**

రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను సమర్థవంతంగా అమలుచేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన హైదరాబాద్ నుండి రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేష్‌కుమార్, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాల కలెక్టర్లు, ఎన్నికల అధికారులు, ఈఆర్‌ఓలతో రివిజన్ పురోగతిని సమీక్షించారు. సంగారెడ్డిజిల్లా నుండి కలెక్టర్ పి.ప్రావీణ్య ఎన్నికల సిబ్బందితో కలిసి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్‌కుమార్ మాట్లాడుతూ 2002 ఎలక్టోరల్ జాబితాను ఆధారంగా తీసుకుని 2025 ఓటర్ల జాబితాను నియోజకవర్గాల వారీగా మ్యాపింగ్‌చేసి, ఓటర్లను నాలుగు కేటగిరీలుగా (ఎ,బి,సి,డి) విభజించినట్లు తెలిపారు. కేటగిరీ ఎ లోని ఓటర్లను బిఎల్ఓ యాప్ ద్వారా ధృవీకరిస్తున్నామని, ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 63 లక్షల ఓటర్ల నిర్ధారణ పూర్తయిందని, మిగిలిన 12లక్షల ధృవీకరణను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్/ జిల్లా ఎన్నికల అధికారిణి పి.ప్రావీణ్య అధికారులతో మాట్లాడుతూ ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో వేగంపెంచాలని, బిఎల్‌ఓలు, బిఎల్ఓ సూపర్‌వైజర్లు సమన్వయంతో కేటగిరీ ఎ ఓటర్లను యాప్‌ద్వారా ధృవీకరణ, కేటగిరీ సి,డి ఓటర్లను కేటగిరీ ఎ కు అనుసంధానం చేసేపనిని త్వరగా పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఈసమావేశంలో ఆర్‌డిఓలు, ఎన్నికలవిభాగ అధికారులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

-విద్యార్థులతో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



వైద్య కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

**సంగారెడ్డి టౌన్, నవంబరు 1, ప్రభాతవార్త:**

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఎంఎన్ఆర్ వైద్య కళాశాలలో నిర్వహించిన నషాముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మాదకద్రవ్యాల అక్రమరవాణాను అరికట్టేందుకు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచనలతో జిల్లా యంత్రాంగం సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటుచేసి అనుమానాస్పద కార్యకలాపాలపై జిల్లా యంత్రాగానికి సమాచారం చేరవేయాలని విద్యార్థులకు సూచించారు. సంగారెడ్డిని మాదకద్రవ్యరహిత జిల్లాగా మలచడడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆందుకు యువత, విద్యార్థులు తమవంతు సహకారం అందించాలన్నారు. నషాముక్త్ భారత్ అభియాన్ 5సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంలో మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమరవాణాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేందుకు మిషన్ పరివర్తన కార్యక్రమం వంటి పలు అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. మాదకద్రవ్యాలు సేవిస్తున్నా, విక్రయిస్తున్నా హెల్ప్‌లైన్ 14446కి సమాచారం చేరవేయాలన్నారు. ఈసందర్భంగా నషాముక్త్ భారత్ గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రఘునందన్, రాష్ట్ర, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి ఖాసిబేగ్, వైద్యకళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, దివ్యాంగులశాఖసిబ్బంది, నషాముక్త్ భారత్ కమ్యూనిటీ ఎడ్యుకేటర్ ఉమేరా, సహిష్ట, ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరుగురికి రూ.60వేల జరిమానా

**గజ్వేల్ టౌన్, నవంబరు 1, ప్రభాతవార్త:**

మద్యం సేవించి వాహనాలు నడిపిన ఆరుగురికి రూ.60వేల జరిమానా విధించడం జరిగిందని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి తెలిపారు. గత కొన్నిరోజులుగా గజ్వేల్ పట్టణంలోని పలు ప్రాంతాలలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఆరుగురువ్యక్తులు మద్యంసేవించి వాహనాలు నడుపుతుండగా వారిని పట్టుకొని బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీచేయగా మద్యంసేవించి ఉన్నట్లు రిపోర్టు వచ్చిందని, వారిని శనివారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరుపరచగా విచారణ జరిపారని, ఆరుగురికి రూ.60వేల జరిమానా విధించడం జరిగిందని ట్రాఫిక్ సిఐ మురళి తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

-రాష్ట్రానికి తలమానికంగా, టూరిస్ట్ హబ్‌గా అర్బన్ ఎకోపార్కు
-రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ పర్యాటకశాఖ మంత్రి కొండా సురేఖ
-అర్బన్ ఎకోపార్క్‌లోని నూతన కాటేజీలను ప్రారంభించిన మంత్రి



ఆర్బన్‌పార్కులో పర్యటిస్తున్న మంత్రి కొండా సురేఖ. ఎంపి రఘునందన్‌రావు ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్, నవంబరు 1, ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించిందని ఈ మేరకు నర్సాపూర్‌లో అర్బన్‌పార్క్‌ను ఏర్పాటుచేసి ఈపార్కులో పర్యాటకులను ఆకర్షించేందుకు ఎకోపార్కును ఏర్పాటు చేసిందని, ఈ ఎకోపార్క్ రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తుందని, అదేవిధంగా ఈ ఎకోపార్క్ టూరిస్ట్ హబ్‌గా మారిందని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ పర్యాటకశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని హైదరాబాద్ ప్రధాన రోడ్డులో అటవీప్రాంతంలో అర్బన్ పార్క్‌లో ఎకోపార్క్, పార్కు కాటేజీలను రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ చేతులమీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా అర్బన్‌పార్కులో పర్యటించి అర్బన్ ఎకోపార్క్‌లోని వసతులను కాటేజీలను ఔషధమొక్కలను పర్యాటకుల కోసం ఏర్పాటుచేసిన వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్రమంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యేకదృష్టి సారించిందని ఈమేరకు తెలంగాణలోని ఒక అరుదైన పార్కును ఇక్కడ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎకోపార్క్ వంటి ప్రాజెక్టులు కొత్త తరానికి స్ఫూర్తినందించే విధంగా ఉంటాయన్నారు. అరుదైన మొక్కలు, పార్కులో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. పార్కులో ఏర్పాటుచేసిన వేదికలు, లగ్జరీ సదుపాయాలు, పిక్నిక్‌స్పాట్స్, ఈవెంట్స్ నిర్వహించుకునే ఫెసిలిటీలు, పచ్చదనంలాంటివి అన్నీ సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబసభ్యుల తోసహా పర్యావరణాన్ని ఆస్వాదించాలనుకునేవారు తప్పకుండా సందర్శించాల్సిన పార్కుగా ఇది రూపుదిద్దుకుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అనంతరం మెదక్ ఎంపి రఘునందన్‌రావు మాట్లాడుతూ వందేమాతరంగీతంలోని సుజలాం, సుఫలాం, మలయజ శీతలాం పదాలలోని ఏ ఒక్కటీ అమలుకావటంలేదన్నారు. ఈ ఎకోపార్కు చెరువు డంపింగ్‌యార్డ్ కావద్దని పలు గ్రామాలు ప్రజలనినాదం రావాలన్నారు. ప్రకృతిని ప్రేమించాలని, కాలుష్యం తగ్గించాలని, పార్కు నిర్వాహకులకు సూచించారు. తరువాత స్థానిక ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ, నర్సాపూర్ నియోజకవర్గానికి అడవి ఒక ఆస్తి, వరం అని అన్నారు. సెలవుల్లో కుటుంబసభ్యులతో ఆహ్లాదంగా గడపడానికి ఈపార్కు ఎంతో దోహదపడుతుందన్నారు. నర్సాపూర్‌లో డంపింగ్‌యార్డ్ నిర్మాణాన్ని ఆపి, నియోజకవర్గ అభివృద్ధికి సహకరించమని మంత్రికి విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యావరణం అడవులు సైన్స్ అండ్ టెక్నాలజీ హమ్మద్ నదీమ్, ప్రధాన అటవీ సంరక్షణ అధికారిణి సువర్ణ, ముఖ్య అటవీ సంరక్షణ అధికారిణి ప్రియాంకవర్గీస్, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపుకలెక్టర్ నగేష్, మృగవని గ్రూప్ ఆఫ్ రిసార్ట్స్ ఎండి విష్ణు చైతన్యరెడ్డి, జిల్లా అటవీ అధికారి జోజీ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అరవింద్, నర్సాపూర్ సెక్షన్ ఆఫీసర్ సాయిరాం, అటవీశాఖ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

-విధులు సక్రమంగా నిర్వర్తించకపోతే కఠినచర్యలు
-జిల్లా కలెక్టర్ హైమావతి



ధాన్యం కొనుగోలు తీరును అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి/సిద్దిపేట అర్బన్ నవంబరు 1, ప్రభాతవార్త:**

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడంతోపాటు విధులు సక్రమంగా నిర్వహించాలని లేనియెడల కఠినచర్యలు తప్పవని జిల్లాకలెక్టర్ కట్ట హైమావతి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌లోగల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆమె శనివారం ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె పిహెచ్‌సిలో శిక్షణ పొందుతున్న నర్సింగ్ కళాశాల విద్యార్థులతో మాట్లాడారు. కళాశాలలో నిర్దేశించిన అకడమిక్ మూల్యాంకనం ప్రకారం శిక్షణ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా శిక్షణ పొందాలన్నారు. అనంతరం ఓపి రిజిస్టర్ పరిశీలించారు. ఫీల్డ్ ఆఫీసర్‌లు ప్రతిరోజు హాజరు రిజిస్టర్‌లో సంతకంపెట్టిన తర్వాతనే ఫీల్డ్‌కి వెళ్ళాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ఆసుపత్రిలో స్టాఫ్, మౌలికవసతుల కొరత ఉంటే డిఅండ్ హెచ్‌ను సంప్రతించాలన్నారు. సమయపాలన పాటించడంతోపాటు మెడిసిన్, పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన...**

సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ కట్ట హైమావతి శనివారం సందర్శించి కొనుగోలు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 3 లారీలలో 1106క్వింటాళ్ల ధాన్యం కొనుగోలుచేసి శ్రీబాలాజీ ఇండస్ట్రీ మిల్లర్ గాడిచర్లపల్లికి పంపించామని మిల్లర్ ట్యాగింగ్ చేసుకొని జెనరేట్ చేస్తే డబ్బులు రైతుల ఖాతాలలో జమ అవుతాయని సెంటర్ సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. వెంటనే మిల్లర్ ట్యాగింగ్ ప్రక్రియ పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిసిఎస్‌ఓను ఫోన్ ద్వారా ఆదేశించారు. రైతులు ధాన్యాన్ని తేమశాతం వచ్చేలాగా పొలాలవద్ద ఆరబోసి తీసుకరావడం మంచిదన్నారు. తేమశాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలుచేసి లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సెంటర్ సిబ్బంది ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం నంగునూర్ మండలం ముంద్రాయిగ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తేమశాతం రాగానే వెంటనే క్లీనింగ్ చేయించి గన్నీలలో నింపి లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సెంటర్ సిబ్బందికి సూచించారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

-జూనియర్ సివిల్ జడ్జ్ ఎం.హేమలత




సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి హేమలత

**నర్సాపూర్, నవంబరు 1, ప్రభాతవార్త:** ఈనెల 15న నర్సాపూర్ కోర్టు ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని, అదేవిధంగా రాజీ చేయదగ్గ కేసులలో రాజీ కుదుర్చుకొనుటకు పోలీసులు సహకారం అందించాలని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జ్, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ న్యాయమూర్తి ఎం.హేమలత పేర్కొన్నారు. శనివారం 15న నిర్వహించే లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ఆధ్వర్యంలో నర్సాపూర్‌కోర్టు ఆవరణలో పోలీస్ అధికారులతో సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తి ఎం.హేమలత మాట్లాడుతూ పోలీసు అధికారులు రాజీచేయదగ్గ కేసులలో కక్షిదారులకు రాజీ కుదుర్చుకొనుటకు చట్టబద్ధంగా సహకారం అందించాలన్నారు. గ్రామీణప్రాంతంలోని కక్షిదారులు క్షణికావేశంలో ఇరువర్గాలు తగాదాపడి కోపతాపాలతో పరస్పరం కేసులు నమోదుచేయించుకొని కోర్టులచుట్టూ తిరుగుతూ తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దని అన్నారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాలు రాజీ పడటమే రాజమార్గం అన్నారు. ఈ మేరకు నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో నవంబరు15న నిర్వహించే జాతీయలోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి సూచించారు. కార్యక్రమంలో ఎజిపిపి సుధాకర్, నర్సాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జాన్‌రెడ్డి, నర్సాపూర్ సబ్ ఇన్స్పెక్టర్ ఎ. రంజిత్‌రెడ్డి, కౌడిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి.మురళి, శివంపేట్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సిహెచ్.మధుకర్‌రెడ్డి, చిలిపిచెడ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రాములు, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎండి.కాజా అజీజ్ అహ్మద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.శ్రీనివాస్‌గౌడ్, లోక్ అదాలత్ బెంచ్ మెంబర్ ఎస్.మధుశ్రీశర్మ, లీగల్‌సర్వీస్ న్యాయవాది సిహెచ్. స్వరూపరాణి, న్యాయవాది ఈ.సాయిరాం, న్యాయవాదులు, లీగల్‌సర్వీస్‌సిబ్బంది, కోర్టుసిబ్బంది, కోర్టుపోలీస్ కానిస్టేబుల్స్, కక్షిదారులు పాల్గొనడం జరిగింది.

## మహేందర్‌ది హత్యే ఆత్మహత్య కాదు

-కుటుంబసభ్యుల ఆరోపణ

**చౌటకూరు, నవంబరు 1, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ జెఎన్టీయు ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ విద్యార్థి బానోత్ మహేందర్ ఆత్మహత్య చేసుకోలేదని, హత్య చేశారంటూ కుటుంబ సభ్యులు ఆరోపించారు శుక్రవారం కళాశాలలో విద్యార్థి మహేందర్ ఆత్మహత్యకుపాల్పడిన విషయం పాఠకులకువిదితమే. సూర్యాపేటజిల్లా మోతే మండలం పెద్దరాజుతండాకు చెందిన మహేందర్ తల్లిదండ్రులు, బంధువులు మహేందర్ మృతిచెందినట్లు తెలుసుని శనివారం కళాశాలకు చేరుకున్నారు. తమ కుమారుడిది ఆత్మహత్య కాదని, హత్యే అని, తమకు న్యాయంచేయాలని డిమాండ్‌చేస్తూ భైఠాయించి నిరసన వ్యక్తంచేశారు. తమ కుమారుడు ఫ్యాన్‌కు ఉరిపెట్టుకుంటే ఫ్యాన్‌రెక్కలు వంగకుండా ఎలా ఉంటాయని, తన కుమారుడు చివరగా హైద్రాబాద్‌లోని రాజుతో ఫోన్‌లో మాట్లాడినట్లు కాల్ రికార్డు ఉందని, రాజునే తమకుమారుడిని హత్యచేశాడంటూ భోరున విలపించారు. మహేందర్ కుటుంబసభ్యులు కళాశాలకు చేరుకున్నట్లు తెలుసుకున్న డిఎస్‌పి సత్తయ్యగౌడ్ కళాశాలకు చేరుకుని కుటుంబసభ్యులతో చర్చించి కళాశాలనుంచి పంపించేశారు. ఈసందర్భంగా డిఎస్‌పి సత్తయ్యగౌడ్ మాట్లాడుతూ విద్యార్థి మృతిపై దర్యాప్తు జరుపుతామని, మృతుడి ఫోన్‌కాల్ లిస్ట్ ఆధారంగా విచారిస్తామని కుటుంబసభ్యులకు హామీ ఇచ్చి పంపామన్నారు.

## జెఎన్టీయు సోలార్ ప్లాంట్‌లో చోరీ

-కోటి రూపాయల విలువ గల వైర్లు చోరి



చోరీకిగురైన సోలార్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

**చౌటకూరు, నవంబరు 1, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌లోని జెఎన్టీయు ఇంజనీరింగ్ కళాశాలలో సోలార్ ప్లాంట్‌లో చోరీ జరిగిన సంఘటన చోటుచేసుకుంది. కళాశాల ఆవరణలోని ఉత్తరభాగంలో గంటకు నాలుగు మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు 24 ఎకరాల్లో సోలార్ ప్లాంట్ 1,2,3 యూనిట్లను ఏర్పాటు చేశారు. యూనిట్ 1లో గత మూడునెలలుగా విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడంతో మరమ్మతులకై శనివారం సిబ్బంది వెళ్లి పరిశీలించగా కేబుల్ వైర్లు దొంగతనం అయినట్లు గుర్తించారు. అన్నీ తెలిసిన వ్యక్తులే దొంగతనం చేసి ఉంటారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దొంగతనానికి గురైన కేబుల్‌వైర్లు 1కోటి రూపాయల విలువ గలవని జెఎన్టీయు అధికారులు పేర్కొంటున్నారు. చోరీ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ విశ్వనాథరాజు పోలీసులకు సమాచారం అందించగా డిఎస్‌పి సత్తయ్యగౌడ్, జగిపేట సిఐ రవికుమార్, పుల్‌కల్ ఎస్ఐ విశ్వజన్‌లు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. సోలార్ ప్లాంట్లలో పనిచేస్తున్న సిబ్బందిని కలిసి పలు విషయాలపై చర్చించారు.

## రాష్ట్ర మంత్రికి స్వాగతం పలికిన కాంగ్రెస్ నేత

-మంత్రికి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికిన నేతలు



రాష్ట్రమంత్రి కొండా సురేఖకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

**నర్సాపూర్, నవంబరు 1, ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణంలోని అర్బన్ పార్క్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎకో పార్క్ కాటేజీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ అటవీశాఖ మంత్రి కొండా సురేఖకు నర్సాపూర్ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి స్థానిక నాయకులు రాష్ట్ర మంత్రి కొండా సురేఖకు శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా రాష్ట్రమంత్రి కొండా సురేఖ రాకకు అర్బన్ పార్క్ వద్ద కాంగ్రెస్ నాయకులు వేచి చూసి మంత్రి రాగానే స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గుప్తా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లేశం పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి


రేగోడ్‌లో కొలువున్న వీర బ్రహ్మేంద్రస్వామి మఠం దృశ్యం

**రేగోడ్, నవంబరు 1, ప్రభాతవార్త:**
ఈ నెల 2వ తారీఖు మండల కేంద్రమైన రేగోడ్‌లో కొలువున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 417వ జయంతిని వైభవంగా నిర్వహిస్తున్నట్లు మఠం పూజారి శివకుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మండలకేంద్రమైన రేగోడ్‌లోనే ఏకైకమఠం ఉందన్నారు. గ్రామస్థులతో పాటు పరిసరగ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని వీర బ్రహ్మేంద్రస్వామిని దర్శించుకుని పునీతులు కావాలని అర్చకులు శివ కుమార్, మఠం కమిటీ బాధ్యులు సూచించారు.

## డాక్టర్‌ను వెంటనే నియమించాలి

**సదాశివపేట, నవంబరు 1, ప్రభాతవార్త:**
సదాశివపేట పట్టణంలో ఉన్న ఈఎస్ఐ ఆసుపత్రిలో డాక్టరును వెంటనే నియమించాలని, గత 20రోజుల నుండి డాక్టర్ రాకపోవడంతో ఆసుపత్రికి వెళ్లే కార్మికకుటుంబాలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తక్షణమే డాక్టరును నియమించాలని సిఐటియు సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వి. ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సంగారెడ్డి కొండాపూర్ సదాశివపేట పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న కంపెనీకార్మికుల కుటుంబాలకు జ్వరాలు వస్తే సదాశివపేట పట్టణంలో ఉన్న ఈఎస్ఐ ఆసుపత్రికి వచ్చి చూపించుకునే పరిస్థితి ఉండేది. ఈఎస్ఐ కార్డు ఉన్న ప్రతి కార్మికునికి ఎవరికైనా వ్యాధులువస్తే సదాశివపేట పట్టణంలో ఉన్న ఈఎస్ఐ ఆసుపత్రికి వచ్చేవారు అని అన్నారు. కాని గత 20రోజుల నుండి ఈ ఆసుపత్రికి డాక్టరు అసలు రావడంలేదు. డాక్టర్ రాకపోవడంతో కార్మిక కుటుంబాలు ఎవరి దగ్గరికిపోయి చూపించుకోవాలో అర్థంకాని పరిస్థితి ఉంది అన్నారు. అసలు డాక్టర్ ఎందుకు రావడంలేదో ఎవరూ సమాధానం చెప్పడంలేదు. జిల్లా అధికారులు తక్షణమే స్పందించి కార్మిక కుటుంబాల యోగక్షేమాల దృష్టిలో పెట్టుకొని సదాశివపేట పట్టణంలో ఉన్న ఈఎస్ఐ ఆసుపత్రిలో డాక్టరును వెంటనే నియమించాలని ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు.

## కళాశాలలో తీరిన మంచినీటి సమస్య


బుధేరా డిగ్రీ కళాశాలలో బోరు వేస్తున్న దృశ్యం

**మునిపల్లి, నవంబరు 1, ప్రభాతవార్త:**
రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు శనివారం బోరు పనులు ప్రారంభించారు. దీనితో కళాశాలలో మంచి నీటి సమస్య తీరిందని కళాశాల సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూరి సుధాకర్ రెడ్డి ఎంపిడిఓ హరినందన్‌రావు, ప్రిన్సిపాల్ మాధవి, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తక్కడపల్లి సంగమేశ్వర్, మాజీ ఎంపిటిసి పాండు, మాజీ కోఆప్షన్ మెంబర్ రహీమొద్దీన్, ఖమ్మంపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు గుడ్డు పటేల్, తుడుం ప్రశాంత్, తాటిపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు ఏడాకులపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలుకేంద్రాలతో రైతులకు అనేక లాభాలు

**-మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి**



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి

**జహీరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:**
రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుంటే అనేక లాభాలు అందుకోవచ్చని మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటుచేసిన సోయాబీన్ కొనుగోలుకేంద్రాన్ని సత్వార్ ఫాక్స్ చైర్మన్ కె.చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ, నియోజకవర్గంలోని రైతులు కొనుగోలుకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రానికి సోయాబీన్ తరలిస్తే క్వింటాలుకు 5328 రూపాయలను అందుకుంటారని, మధ్య దళారులకు ధాన్యాన్ని అమ్ముకుని ఆర్థికంగా నష్టాలకు గురికాకూడదన్నారు. రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సోయాబీన్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసిందని, అన్నదాత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి, డైరెక్టర్‌లు జాఫర్, శంకర్‌పాటిల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై యువత అవగాహన కలిగిఉండాలి

**-మియాపూర్ ఎసిపి సిహెచ్ వై.శ్రీనివాస్‌కుమార్**



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎసిపి శ్రీనివాస్‌కుమార్

**రామచంద్రాపురం, నవంబరు 1, ప్రభాతవార్త:**
విద్యార్థులు, యువత చట్టాలపై అవగాహన పొంది ఉండాల్సిన అవసరం ఉందని మియాపూర్ ఎసిపి సిహెచ్ వై.శ్రీనివాస్‌కుమార్ అన్నారు. శనివారం బిహెచ్ఈఎల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చట్టాలపై అవగాహన కార్యక్రమానికి ఎసిపి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు పలు సూచనలు చేశారు. 18సంవత్సరాలలోపు వారు వాహనాలను తోలరాదన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా యువత, విద్యార్థులు ఉండాలన్నారు. మహిళలను వేధించడం, కళాశాలలో ర్యాగింగ్ చేయడం చేస్తే చట్టాలు చూస్తూ ఊరుకోవని హెచ్చరించారు. అమ్మాయిలు అఘాయిత్యాలకు గురయితే 100కు డయల్ చేయలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రవీందర్, ఇఐ డాక్టర్ జి.జగన్నాథ్, ఎస్ఐలు ప్రియదర్శిని, గోపరాజు, నారాయణ, యాదగిరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మండలంలో వరి కొనుగోలు కేంద్రాలు


వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**చౌటకూరు, నవంబరు 1, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చౌటకూరుతో పాటు మండల పరిధిలోని వెండికోట్, వెంకట కిష్టాపూర్, పోసన్‌పల్లి, బొమ్మారెడ్డిగూడెం, ఉప్పరగూడెం గ్రామాల్లో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు ఆత్మకమిటీ చైర్మన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నత్తి దశరథ్ నాయకులు, అధికారులతో కలసి కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో చక్రియాల ఆలయ కమిటీ చైర్మన్ లక్ష్మణ్, మండల కాంగ్రెస్ నాయకులు మహిపాల్‌రెడ్డి, రామగౌడ్, ఈశ్వర్‌గౌడ్, గోవర్ధన్, పత్తి రాములు, మైలానా, కైసర్, ఆగమయ్య, వర్గాల రమేష్, మనోజ్, కరుణాకర్, పల్లవి జయరాంరెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, పండరి, భాస్కర్, ప్రకాష్, మల్లికార్జున్‌గౌడ్, రోల్లపాటి రాజశేఖర్, చాకలి అశోక్, గొల్ల మహేష్, నల్లగండ్ల వెంకటరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంటి రమేష్, శ్రావణ్, రాజాగౌడ్, ఫెరోజ్, సారా సంజయ్‌కుమార్, మహిపాల్‌రెడ్డి, శ్రీహరి, శివరాజ్, ఆంజనేయులు, వినయ్, ప్రభాకర్, సత్యనారాయణ, హరిసింగ్‌నాయక్, మహేష్‌రాథోడ్, మేఘరాజు, రాఘు, గణపతినాయక్, అట్టే రాములు, మహేందర్‌రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

## ఏడాకులపల్లిలో సోయాబీన్ కొనుగోలు కేంద్రం

**-ప్రారంభించిన ఎమ్మెల్యే, డిసిఎంఎస్ చైర్మన్**


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, డిసిఎంఎస్ చైర్మన్

**ఝరాసంగం, నవంబరు 1, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఏడాకులపల్లిలో ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్‌లు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో సోయాబీన్ అమ్ముకుంటే క్వింటాలుకు 5328 రూపాయల మద్దతు ధరను అందుకుంటారన్నారు. దళారుల వద్ద సోయాబీన్‌ను అమ్ముకుని ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. తడిసిన ధన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు, డైరెక్టర్లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసి సభ్యులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావును పరామర్శించిన మున్సిపల్ పాలకవర్గ మహిళాసభ్యులు


హరీష్‌రావును పరామర్శిస్తున్న మహిళ కౌన్సిలర్లు

**సిద్దిపేట అర్బన్, నవంబరు 1, ప్రభాతవార్త:**
మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు తండ్రి సత్యనారాయణ ఇటీవల మృతిచెందగా హైదారాబాద్ కోకాపేటలోని క్రిన్స్ విల్లాస్‌లో ఆయనను సిద్దిపేట మున్సిపల్ పాలకవర్గం చైర్మన్ కడవెర్గు మంజులతో పాటు మహిళాకౌన్సిలర్లు శనివారం పరామర్శించారు. అనంతరం సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ మహిళాకౌన్సిలర్లు గూడాల సంధ్య శ్రీకాంత్ గౌడ్, వరల కవిత సురేష్, కాటం శోభరాఘురామ్, వంగ రేణుక తిరుమల్ రెడ్డి, అడ్డగట్ల కావేరి అంజి, ఫాతిమాబేగం వజీర్, తస్లీమ్‌బేగం మోయిజ్, గోపాలపురం దీప్తి నాగరాజు, బాల్‌లక్ష్మీ, భాగ్యలక్ష్మీ తదితరులు ఉన్నారు.

## 3న విద్యుత్తు వినియోగదారుల దినోత్సవం

**-రామాయంపేట విద్యుత్తుశాఖ ఎడిఇ ఆదయ్య**

**రామాయంపేట, నవంబరు 1, ప్రభాతవార్త:**
రామాయంపేట సబ్‌డివిజన్ అధికార పరిధిలో విద్యుత్తు వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 3వ తేదీ సోమవారం విద్యుత్తు వినియోగదారులదినోత్సవం (కన్స్యూమర్స్‌డే) నిర్వహిస్తున్నట్లు విద్యుత్తుశాఖ రామాయంపేట ఎడిఇ ఆదయ్య తెలిపారు. ఈసందర్భంగా రామాయంపేట సబ్‌డివిజన్ అధికారపరిధిలో రైతులకు కాని, గృహావసర విద్యుత్తు వినియోగదారులకు కాని దీర్ఘకాలికంగా విద్యుత్తు సమస్యలు ఏమైనా ఉన్నా, మీటర్లు, అధికబిల్లులు వచ్చినా, రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లకు కాని, విద్యుత్తు వైర్లకు సంబంధించి కాని తదితర సమస్యలను రామాయంపేట సబ్‌డివిజనల్ ఆఫీసులో సోమవారం 10.00గంటల నుంచి మధ్యాహ్నం 1వరకు నిర్వహించే ఈప్రత్యేక కార్యక్రమానికి వచ్చి తమ సమస్యలను తెలియజేస్తే వాటిని పరిష్కరించడం జరుగుతుందని ఆదయ్య తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ములుగు, నవంబరు 1, ప్రభాతవార్త:**
ములుగు సెక్షన్ కేంద్రంలోని కొక్కొండ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈనెల 2వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కెవి బస్వాపూర్ ఇండస్ట్రియల్, 11కెవి కొక్కొండ వ్యవసాయ, సింగన్నగూడ వ్యవసాయ ఫీడర్లపై, అగ్రావుపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు ఇది గమనించి సహకరించాలని కోరారు.

## క్రమశిక్షణతో చదువుకుంటేనే ఉన్నతస్థాయి

**-గిరిజన గురుకుల విద్యార్థినులతో న్యాయమూర్తి శ్రీధర్**


విద్యార్థినులకు సూచనలు చేస్తున్న న్యాయమూర్తి మందాని శ్రీధర్

**నాగల్‌గిద్ద, నవంబరు 1, ప్రభాతవార్త:**
విద్యార్థినులు క్రమశిక్షణతో లక్ష్యంతో విద్యను అందుకుంటే ఉన్నతస్థాయిలో స్థిరపడవచ్చని నారాయణఖేడ్ మున్సిఫ్‌మెజిస్ట్రేట్‌కోర్టు న్యాయమూర్తి మందాని శ్రీధర్ అన్నారు. శనివారం మండలపరిధిలోని కరస్‌గుత్తి గ్రామంలోని గిరిజన బాలికల గురుకుల కేంద్రాన్ని న్యాయమూర్తి సందర్శించి విద్యార్థినులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన పొంది ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వసతిగృహంలో విద్యార్థినులు ఏవైనా సమస్యలను ఎదుర్కొంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విద్యాలయం ప్రిన్సిపాల్, ఎస్ఐ రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## నష్టపరిహారం ఎకరాకు రూ.25వేలు అందించాలి


నష్టపోయిన వరిపంటను పరిశీలిస్తున్న దృశ్యం

**నంగునూర్, నవంబరు 1, ప్రభాతవార్త:**
మొంథా తుపాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులు తీవ్ర దుఃఖంలో ఉన్నారని వెంటనే ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించాలని మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ వేను చక్రవర్తి డిమాండ్ చేశారు. మొంథా తుపాన్‌తో మండలంలో పంటలకు తీరనినష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టపరిహారం కింద ప్రతి ఎకరాకు రూ.25వేల ఆర్థిక సహాయం అందించాలన్నారు. మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో శనివారం బిఆర్ఎస్‌పార్టీ నాయకులు కనకరాజు, రాజయ్యలతో కలిసి రైతుల పంటపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు రైతులను చిన్నచూపు చూస్తుందన్నారు. కాంగ్రెస్ సర్కారు రైతులపాలిట శాపంగా మారిందన్నారు. రైతులపై సర్కార్‌కు ఏమాత్రం ప్రేమ ఉన్నా వెంటనే నష్టపోయిన రైతులకు రూ.25వేల ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలన్నారు.

## యుపిఎస్‌సిలో 29వ ర్యాంకు సాధించిన సంధ్య


సంధ్యను సన్మానిస్తున్న టిజెయు నాయకులు

**జగదేవ్‌పూర్, నవంబరు 1, ప్రభాతవార్త:**
జగదేవ్‌పూర్ మండల పరిధిలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన తప్పెట్ల లక్ష్మి, సత్యనారాయణల పెద్దకూతురు తప్పెట్ల సంధ్య యుపిఎస్‌సి-2025లో 29వ ర్యాంకు సాధించి హైడ్రో జియాలజిస్ట్‌గా ఎంపికయ్యారు. తల్లిదండ్రుల కష్టాన్ని చూసి కష్టపడి చదివి యుపిఎస్‌సిలో 29వ ర్యాంకు సాధించడంతో యువతకు ఆదర్శంగా నిలిచింది. సంధ్య విజయంపై మండలప్రజలతోపాటు గ్రామస్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తంచేస్తూ అభినందించారు. ఈసందర్భంగా శనివారం తెలంగాణ జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి, జిల్లా అధ్యక్షుడు మరాఠి కృష్ణమూర్తిలు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్టుల సంఘం కోశాధికారి శ్రీనివాస్, గ్రామస్థులు రమేష్, తల్లి లక్ష్మి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులచే వెట్టిచాకిరీ చేయిస్తున్న ఉపాధ్యాయులు

**-ఏడాది కాలంగా ఇదే తంతు!!**


ఆర్అండ్‌బి రోడ్డుపై టీ ఫ్లాస్కు, గ్లాసులతో విద్యార్థులు

**మునిపల్లి, నవంబరు 1, ప్రభాతవార్త:**
మునిపల్లి మండలం కంకోల్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే ఉపాధ్యాయులు వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. వారి అవసరాల నిమిత్తం చిన్నారులను బలి పశువులను చేస్తున్నారు. శనివారం కంకోల్ తాటిపల్లి ఆర్అండ్‌బి రోడ్డుపై చిన్నారులు టీ ఫ్లాస్క్, గ్లాసులతో వెళ్లడం గమనించిన విలేకరులు వారిని బాలకార్మికులుగా భావించి, అపి ప్రశ్నించగా తమచే ప్రతి రోజు ఉపాధ్యాయులు టీలు తెప్పించుకుంటారని ఆరో తరగతి విద్యార్థి మహేష్, ఐదో తరగతి విద్యార్థి కార్తికేయలు తెలిపారు. పాఠశాలలో అటెండర్, స్వీపర్‌లతో పాటు పూర్తిస్థాయి సిబ్బంది ఉన్నప్పటికీ చిన్నారులచే వారి వ్యక్తిగత పనులు చేయించుకోవడం విడ్డూరంగా ఉందని పలువురు వాపోయారు. ఎపుడూ రద్దీగా వుండే కంకోల్ తాటిపల్లి రోడ్డుపై విద్యార్థులకు ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సంవత్సర కాలంగా విద్యార్థులచే ఈపనులు చేయించుకుంటున్నారని తెలిసింది. గతంలో ఈ రోడ్డుపై అనేక ప్రమాదాలు జరిగిన సంఘటనలు వున్నాయి. గత శుక్రవారం జిల్లా కలెక్టర్ సందర్శించి వెళ్లిన మరుసటిరోజే విద్యార్థులచే తమ వ్యక్తిగత పనులు చేయించుకోవడం గమనార్హం. చిన్నారులచే వ్యక్తిగత పనులు చేయించుకోవడం పట్ల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్థులు పేర్కొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

**-హెచ్ఎం బస్వారాజ్ వీడ్కోలు సభలో ఎంఈఓ**


హెచ్ఎం బస్వరాజ్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**జహీరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:**
ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని మండల విద్యాధికారి మానెయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని సత్వార్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అవుసలి బస్వరాజ్ పదవీవిరమణ పొందడంతో పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి ఎంఈఓ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పదవీవిరమణపొందిన బస్వరాజ్‌దంపతులకు ఎంఈఓ తోపాటు తోటి ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి వీడ్కోలుపలికారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శృంగేరి పీఠాధిపతిని దర్శించుకున్న ఎమ్మెల్సీ


పీఠాధిపతిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ కుటుంబసభ్యులు

**రామచంద్రాపురం, నవంబరు 1, ప్రభాతవార్త:**
ధర్మవిజయయాత్రలో భాగంలో హైద్రాబాద్ మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శారదా శంకరమఠానికి చేరుకున్న దక్షిణామ్నాయ శృంగేరి పీఠాధిపతి శ్రీవిదుశేఖర భారతీస్వామిని శనివారం ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి కుటుంబసభ్యులు దర్శించుకుని స్వామివారి ఆశీసులు అందుకున్నారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డితోపాటు అంజిరెడ్డి ధర్మపత్ని బిజెపి జిల్లా అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరిఅంజిరెడ్డి కుటుంబసభ్యులు ఉన్నారు.

## యూత్ కాంగ్రెస్ నాయకుడి అంత్యక్రియల్లో పాల్గొన్న ఎంపి

**నారాయణఖేడ్, నవంబరు 1, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నిజాంపేట్ మండలం గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు చరణ్ అంత్యక్రియల్లో జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు నగేష్ శెట్కార్, జిల్లా ప్రణాళికాసంఘం మాజీసభ్యులు పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. జిల్లా నాయకులు మాజీ ఎంపిపి బాలకిషన్ కుమారుడు, యూత్‌కాంగ్రెస్ నాయకుడు చరణ్ నిన్న బ్రెయిన్‌స్ట్రోక్ కారణంగా మృతిచెందారు. ఈరోజుజరిగిన అంత్యక్రియలలో ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, పట్లోల చంద్రశేఖర్‌రెడ్డి రాష్ట్ర నాయకులు, ఉమ్మడి జిల్లా మాజీ ప్రణాళికాసంఘ సభ్యులు నగేష్ శెట్కార్, పట్లోల సుధాకర్‌రెడ్డి జిల్లా నాయకులు తదితరులు చరణ్ భౌతికదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా జీవుల నాయక్ మాజీ ఎంపిపి రసీద్ తదితరులు కూడా పాల్గొన్నారు.

## చీఫ్ జస్టిస్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలి

**-ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పోసాన్‌పల్లి రాజు**


**జగదేవ్‌పూర్, నవంబరు 1, ప్రభాతవార్త:**
భారత అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్ బిఆర్.గవాయిపై బూటు విసిరి దాడికి పాల్పడ్డ వ్యక్తులను కఠినంగా శిక్షించాలని జగదేవ్‌పూర్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పోసాన్‌పల్లి రాజు అన్నారు. శనివారం హైద్రాబాద్‌లో నిర్వహించిన దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన ర్యాలీకి జగదేవ్‌పూర్ మండల ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా జస్టిస్ బిఆర్.గవాయిపై బూటు విసరడం అవమానకరమని అన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిపైనే ఇలాంటి సంఘటన జరిగితే ఎలాంటికేసు నమోదుచేయకపోతే దేశంలో సామాన్యుల పరిస్థితి ఏమిటని అన్నారు. ఇప్పటికైనా వెంటనే దాడికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్‌చేసి కఠినంగా శిక్షించాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసన చేపడతామన్నారు. కార్యక్రమంలో సాయిలు, కిష్టయ్య, నర్సింలు, ముక్కెర నాగరాజు, మాసపాక నర్సింలు, పైస స్వామి, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**-ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డి**

**వర్గల్, నవంబరు 1, ప్రభాతవార్త:**
ప్రభుత్వ పాఠశాలల్లోనే మంచి నాణ్యమైన విద్య లభిస్తుందని వర్గల్ మండల విద్యాధికారి ఉదయభాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మల్లారెడ్డిపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు గ్రామ మాజీ ఉపసర్పంచ్ జైపాల్‌రెడ్డి టై, బెల్ట్, ఐడి కార్డులను పంపిణీచేశారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గ్రామస్థుల సహాయ సహకారాలు అవసరమని తెలిపారు. జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని పాఠశాల సమస్యలను పరిష్కరించడంలో తనవంతు సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం దాత జైపాల్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో వర్గల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశంగౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గారెడ్డి, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ఎఎపిసి చైర్మన్ ఈశ్వరమ్మ, సిఆర్‌పి యాదగిరి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం వ్యాఖ్యలను నిరసిస్తూ బిజెపి రాస్తారోకో



సిఎం వ్యాఖ్యలను సిరసిస్తూ రాస్తారోకో చేస్తున్న బిజెపి నాయకులు

**జహీరాబాద్, నవంబరు 1, ప్రభాతవార్త:**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలప్రచారంలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆపరేషన్ సింధూర్, ప్రధానమంత్రి నరేంద్రమోడీ, హోంశాఖమంత్రి అమిత్‌షాలపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం జహీరాబాద్ పట్టణంలో పట్టణ అధ్యక్షులు పూల సంతోష్ ఆధ్వర్యంలో ర్యాలీ, రాస్తారోకో కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్, జిల్లా ఉపాధ్యక్షులు గొల్ల భాస్కర్‌లు మాట్లాడుతూ ఓ వర్గం ఓట్లకోసం సిఎం భారత సైనికులను, దేశ ప్రధానమంత్రిని అవమానించడం సరికాదని హెచ్చరించారు. పాకిస్తాన్‌ను పొగుడుతూ మాట్లాడటం భారతదేశాన్ని అవమానపర్చమే అవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అనితపాటిల్, అశోక్, బంటు విశ్వనాథ్, మల్లేష్, అరుణ్, విశ్వనాథ్, సోమ అనిల్, అశోక్‌పాటిల్, సురేష్ పురి, నీలేష్, రామ్‌శెట్టి, సంతోష్ పాలింకర్, శ్రవణ్, శేఖర్, శ్రీకాంత్, శ్రీనివాస్, చందు, రమేష్, దేవరాజ్ పాల్గొన్నారు.